NO FAME
NO NAME
NO SELF INTEREST
ONLY GOD

శ్రీ హరిః

రూ॥ 10/-

# మధురమురళి

భక్తి మాస పత్రిక


మురళి-3 | డిసెంబర్-2011 | గానం-09



హరే రామ హరే రామ రామ రామ హరే హరే
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే



బర్మింగ్‌హ్యామ్ (ఇంగ్లాండ్) నందు శ్రీమద్భాగవతం




శ్రీ హరి:

శ్రీ శ్రీ మురళీధర స్వామీజి వారి

ఆశీస్సులతో

# మధుర మురళి

భక్తి మాస పత్రిక

**Published & Edited by**

**Mrs. Srilatha Ravichandran**
on behalf of Sri Sandeepani
Gurukula Seva Trust (A.P.),
Hyderabad - 82

*Copyright of articles published in* **MADHURAMURALI** is reserved. No part of this magazine may be reproduced, reprinted or utilised in any form without permission in writing from the publisher of Madhuramurali.

మురళి : 3 డిసెంబర్-2011 గానం : 09

| క్ర.స. | విషయ సూచిక | | పేజి నెం. |
|---|---|---|---|
| 1. | శ్రీ స్వామీజీ వారి కీర్తనము | : | 2 |
| 2. | శ్రీ సద్గురు అమృతవాణి | : | 3 |
| 3. | ఎందరో మహానుభావులు | : | 7 |
| 4. | చిన్నారులకు ఓ కథ | : | 9 |
| 5. | ప్రశ్నలు-సమాధానములు | : | 13 |
| 6. | శ్రీ స్వామీజీ యొక్క సంభాషణముల నుండి | : | 16 |
| 7. | శ్రీమద్భాగవతము - ప్రథమ స్కంధము | : | 18 |
| 8. | భక్త మీరా | : | 20 |
| 9. | ఆత్మదర్శనం | : | 23 |
| 10. | సనాతన విడికథలు | : | 25 |
| 11. | పిబరే ప్రేమరసం | : | 27 |
| 12. | రామాయణ విశేషములు | : | 29 |

**హరే రామ హరే రామ రామ రామ హరే హరే।**
**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే॥**

# శ్రీ స్వామీజీ వారి కీర్తనము

**రాగం : తిలంగ్** **తాళం : ఆది**

**పల్లవి**

విఠ్ఠల నామస్మరణం సర్వ అజ్ఞాన నాశకం

**అనుపల్లవి**

విఠ్ఠల విఠ్ఠల పాండురంగ విఠ్ఠల విఠ్ఠల పాండురంగ ॥విఠ్ఠల నామస్మరణం॥

**చరణములు**

భీమా నదితీరం సర్వపాప విమోచనం ॥విఠ్ఠల నామస్మరణం॥

చంద్రభాగా నదిస్నానం సర్వదుఃఖ నివారణం ॥విఠ్ఠల నామస్మరణం॥

పాండురంగ దర్శనం సర్వపాప విమోచనం ॥విఠ్ఠల నామస్మరణం॥

పండరీ క్షేత్రవాసః సర్వజన్మ పుణ్యలాభః ॥విఠ్ఠల నామస్మరణం॥

విఠ్ఠల భక్త్యాఏవ సర్వ నిశ్చితం వైకుంఠ ప్రాప్తిః ॥విఠ్ఠల నామస్మరణం॥

**నామావళి**

విఠ్ఠల విఠ్ఠల పాండురంగ విఠ్ఠల విఠ్ఠల పాండురంగ

**విజ్ఞప్తి**

శ్రీ శ్రీ మురళీధర స్వామీజి వారి గురించి (లేదా) శ్రీ సాందీపని గురుకుల సేవా ట్రస్టు గురించి (లేదా) **"మధురమురళి"** భక్తి మాస పత్రిక గురించి మీకు ఏమైనా వివరములు కావలసివస్తే సంప్రదించవలసిన చిరునామా:


**Mrs. Srilatha Ravichandran**
2nd Floor , Shyam Apartments, 6-3-563/ F,
Erramanzil, Hyderabad -500 082
Ph : 98480 - 24928/ 040-23392758, 23315150.
email:lataravi@hotmail.com
Related websites : www.madhuramurali.org/
www.namadwaar.org

# శ్రీ సద్గురు అమృతవాణి
## శ్రీధర అయ్యావాళ్

– శ్రీస్వామీజీ

సంగీతములో త్రిమూర్తులుగా త్యాగరాజ స్వామి, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు – ఈ మహనీయుల్ని మనం ప్రశంసిస్తుంటాము. ఎందుకంటే, వీరు సంగీత ప్రపంచానికి ఎనలేని సేవ చేసి యున్నారు. అనేకానేక కీర్తనలు రచించియున్నారు. దైవాన్ని సంగీతం ద్వారా ఆరాధించి యున్నారు. ఎలాగైతే సంగీతములో త్రిమూర్తులుగా వీరున్నారో, అలాగే తమిళనాడులో "భగవన్నామమే కలియుగములో భగవంతుడిని చేరేందుకు మార్గము" అని ముగ్గురు మహాత్ములు ప్రచారం చేశారు. వీరిని కూడా త్రిమూర్తులని చెప్తారు పెద్దలు. వీరిలో అగ్రస్థానములో ఉన్న వారు 'భగవన్నామ బోధేంద్ర స్వాములు'. గోవిందపురము అనబడే ఊరిలో జీవ సమాధిలో ఉంటూ, ఇప్పటికీ తారక మంత్రమైన రామ నామాన్ని జపిస్తూ ఉంటున్నారు. వీరు కంచికామకోటి పీఠమునకు పీఠాధిపతియై ఉన్నప్పటికీ ఒక సందర్భంలో తన పీఠాధిపత్యాన్ని త్యజించి, స్వతంత్రంగా తమిళనాడులోని అన్ని ప్రదేశాలలోనూ సంచరిస్తూ, కనబడే ప్రతి ఒక్కరికీ  రామనామ జపము యొక్క మహిమను వివరిస్తూ, రామనామ మంత్రోపదేశము చేస్తూ వచ్చే వారు. ఈ వివరాలు నేను ఇదివరకే చెప్పి ఉన్నాను.

వీరి తరువాతి స్థానంలో నామ మహిమను తమిళనాడులోని ప్రజలకు ప్రచారము చేసిన మహనీయుడు శ్రీధర అయ్యావాళ్. వీరు కూడా భాగవత ధర్మాన్ని అనుసరిస్తూ ఎల్లప్పుడూ శివనామ మంత్రం జపిస్తూ, ప్రజలందరికీ శివనామ మంత్రోపదేశము చేస్తూ శివ ధ్యానములో గడిపేవారు.

శ్రీధర అయ్యావాళ్ మైసూరులో జన్మించారు. శివభక్తికి నిలయమైన కర్నాటక దేశములో మైసూరు మహారాజా యొక్క ఆస్థానములో దివానుగా ఉన్న ఒక సత్పురుషుడి వంశములో అవతరించారు శ్రీధర అయ్యావాళ్. చిన్నతనము నుండే శివనామ జపము చేస్తూ శివభక్తితో పెరిగాడు ఈ శిశువు. మామూలు బిడ్డలకూ మహాత్ములకూ తేడా చిన్నతనము నందే తెలిసిపోతుంది. మహాత్ములు పుడతారు, తయారు చేయబడరు.

శ్రీధర్ అయ్యావాళ్ పెరిగి పెద్దై సకల శాస్త్రాలు చదివి మహామేధావిగా ప్రకాశించారు. ఎప్పుడూ శాంతస్వభావముతో, మేధస్సుతో కనబడే ఈ బాలుడంటే రాజుగారికి ప్రీతి ఎక్కువ. శ్రీధర అయ్యావాళ్ తండ్రి మరణానంతరము తన కొలువులో దివాన్ పదవిని స్వీకరించవలసిందిగా రాజుగారు వేడుకున్నారు.

కాని శ్రీధర అయ్యావాళ్ ఏమి చెప్పారు? "నా మనస్సు ఈ రాజ పదవులలో, రాజభోగాలల్లో ప్రీతి చెందుటలేదు. నేను ఎప్పుడూ శివారాధన చేసుకుంటూ, తీర్థయాత్రలు, పుణ్య క్షేత్రాల దర్శనాలు చేసుకుంటూ ఉండాలని కోరుతున్నాను" అని సమాధానమిచ్చి రాజు యొక్క ప్రార్థనను తోసిపుచ్చి తన భార్యనూ, తల్లినీ తీసుకుని పలు పుణ్యతీర్థాలలో స్నానము ఆచరిస్తూ, క్షేత్రాలను దర్శిస్తూ తమిళ దేశానికి వచ్చారు. తమిళనాడులో కావేరి నదీ తీరాన వెలసిన 'తిరుచ్చిరాపల్లి' అనే నగరాన్ని చేరారు. అది ఒక మంచి శివక్షేత్రము. అక్కడ 'మలైక్కోట' అనే కొండపై ఉన్న శివుడికి 'మాతృభూతేశ్వరుడు' అని పేరు. 'తాయుమానవర్' అనేది ఆ శివుడి తమిళ నామకరణమ. (అంటే 'తల్లియు అయిన వాడు' అని అర్థము.)

ఆ ఊరిలో ఒక గృహములో నివసిస్తూ, రోజూ తెల్లవారుజామున మూడు గంటలకే నిద్రలేచి, ఐదు గంటల లోపలే స్నానము, గాయత్రి జపము ముగించుకుని, శివపంచాక్షరీ నామాన్ని జపిస్తూ ఉంఛవృత్తితో భిక్ష చేస్తూ, అందులో వచ్చిన గింజలతో అన్నము వండి భగవంతునికి నివేదనము చేసి అయ్యావాళ్ వారి కుటుంబమువారు భోజనము చేసేవారు. ఎల్లప్పుడూ భాగవతము, రామాయణము మొదలైన గ్రంథాలను పారాయణము చేస్తూ, తమ వద్దకు వచ్చిన వారికి పురాణ ఇతిహాసాలను ఉపన్యసిస్తూ, మూడు పూటలా ఆ క్షేత్రమూర్తియైన మాతృభూతేశ్వరుడి ఆలయానికి వెళ్ళి దర్శిస్తూ, జీవితాన్ని గడుపుతూ వచ్చారు శ్రీధర అయ్యావాళ్.

ప్రతి దినము వారు గుడికి వెళ్ళేవారు కదా! ఒక పసి పిల్లవాడు కూడా మెడలో రుద్రాక్షమాల, నుదుట మీద విభూతి రేఖలు ధరించి ఆ కొండ పైకి మెట్లెక్కి వచ్చి శివదర్శనము చేసుకునే వాడు. ప్రతిరోజూ శ్రీధర అయ్యావాళ్ ఆ పిల్లవాడ్ని చూసేవారు. ఒక రోజు ఆ పిల్లవాడు గుడికి రాలేదు. శ్రీధర అయ్యావాళ్ కాసేపు గుడిలోనే వేచి చూశారు. ఆ పిల్లవాడు కనిపించలేదు. 'సరే! ఏమి కారణమో తెలియలేదు; ఆ బాలుడు ఇవాళ గుడికి రాలేదు!' అని తలచుకుంటూ తన గృహానికి వెళ్ళనారంభించారు. వెళ్ళేదారిలో ఒక ఇంటి ముందు కొంతమంది ఏడుస్తూ

కనబడ్డారు. ఏమని విచారించగా ఆ పసివాడు మరణించాడని తెలిసింది. వారి మనస్సు చాలా బాధపడింది. వారి చేతిలో తీర్థపాత్ర, విభూతి సంపుటము ఉన్నాయి. ఈ తీర్థాన్ని తీసి, అతి శ్రేష్టమైన శివ పంచాక్షరీ మంత్రాన్ని ఉచ్చరించి ఆ పిల్లవాడి మీద చల్లారు. విభూతిని తీసి వాడి నుదుటికి 'నమశ్శివాయ' అంటూ దిద్దారు. అంతే! వెంటనే ఆ పిల్లవాడు లేచి కూర్చున్నాడు. బంధువులంతా సంతోషించారు, ఆశ్చర్యపోయారు. ఊరంతా ఈ విషయం వ్యాపించింది. ఊరిలో కష్టాలలో ఉన్న వారంతా శ్రీధర అయ్యావాళ్‌ని వెతుక్కుంటూ రావడం ప్రారంభించారు. ఆ దేశపు రాజు కూడా ఈ వార్త విని పలు ఉపచారాలు చేస్తూ వారిని పూజించాడు.

"మీరు ఇక్కడే స్థిరముగా నివసించాలి. మీకు కావలసిన అన్ని వసతులు ఏర్పాటు చేస్తాను. ఇంకెక్కడికి వెళ్ళకండి" అంటూ ప్రాధేయపడ్డాడు.

చూశారు అయ్యావాళ్.

'మా కులవృత్తియైన దివాన్ పదవినే కాదని స్వతంత్రంగా తిరుగుతున్న వాడిని, రాజ్య భోగాలు నాకు అవసరము లేదు, నిశ్చింతగా శివారాధన చేసుకోవటమే నాకు ఇష్టము. ఈ రాజు పెట్టే నిర్బంధానికి అంగీకరిస్తే ఈ రాజుకి బందీనైపోతాను' అని తలచి ఒక రాత్రి ఎవరికీ తెలియకుండా కుటుంబంతో సహా బయలుదేరి మరలా ఇంకొన్ని తీర్థాలలో స్నానమాచరించి, క్షేత్రాలను దర్శిస్తూ 'తిరువిడైమరుదూర్' అనే క్షేత్రాన్ని చేరారు. ఆ ఊరిలోని శివునికి 'మహాలింగం' అని పేరు. ఈ క్షేత్రము తమిళనాడులో వున్న శివక్షేత్రాలలో చాలా ముఖ్యమైన స్థలము.

ఈ మహాలింగస్వామిని గురించి కంచి మహా పెద్దస్వాముల వారు చాలా శ్లాఘించి చెప్పి ఉన్నారు. ఒక సమయం తిరువిడైమరుదూర్ సమీపాన ఉన్న ఒక గ్రామము నుండి ఒక భక్తుడు హిమాలయములో ఉన్న కేదారనాథ్‌కి వెళ్ళి కేదార్ లింగాన్ని దర్శించుకుని తిరిగి వచ్చారు. వారు కంచికి వెళ్ళి పెద్ద (పరమాచార్యుల) స్వాములు వారిని కలిసి నమస్కరిస్తూ, 'స్వామీ! నేను కేదార లింగాన్ని దర్శించుకుని వస్తున్నాను" అన్నారట. అప్పుడు కంచి పరమాచార్యుల వారు అడిగారు, 'మీది ఏ ఊరు' అని. అప్పుడు ఆ భక్తుడు తన సొంత ఊరు 'తిరువిడైమరుదూర్' సమీపములో ఉన్న ఒక గ్రామం అని సమాధానమిచ్చారట. దానికి పెద్ద స్వాముల వారు నవ్వి, "మీ గ్రామానికి సమీపాన ఉన్న "మహాలింగం" అని పిలవబడే తిరువిడైమరుదూర్ క్షేత్రములో వెలిసి ఉన్న స్వామి కన్నా ఆ కేదారలింగం ఏ మాత్రం గొప్పది కాదు"

అని సెలవిచ్చారట. అంతటి గొప్ప దేవుడు 'తిరువిడైమరుదూర్ మహాలింగస్వామి.'

ఈ విధముగా తిరువిడైమరుదూర్ క్షేత్రాన్ని దర్శించుకుంటూ, గోవిందపురము, దానికి సమీపాన ఉన్న 'తిరువిశలూర్' అని పిలవబడే 'తిరువిశైనల్లూర్' గ్రామాన్ని చేరారు శ్రీధర అయ్యావాళ్. ఆ కాలములో తంజావూర్‌ని పరిపాలించిన మరాఠీరాజు, వేద శాస్త్ర పండితుల్నీ, భాగవతోత్తముల్నీ, సాధు సత్పురుషుల్నీ, మంచి భక్తుల్ని సన్మానించి, మరియు వారికి ఆ క్షేత్రములో నూతన నివాస గృహములు ఏర్పరచి ఇచ్చి, అక్కడ వారికి అన్ని సదుపాయాలు సౌకర్యాలు అమర్చి, బహుమతులిచ్చి ప్రోత్సహించి వారు తమ తపస్సును కొనసాగించుటకు తోడ్పడ్డాడు. శ్రీధర అయ్యావాళ్ అన్ని క్షేత్రాలూ దర్శిస్తూ ఈ తిరువిశలూర్‌ని చేరుకున్నారు. అక్కడ సాధు సత్పురుషులు, పండితులు, భక్తులు నివసిస్తూ ఉండటము చూశారు. 'మనం కూడా ఇక్కడ నివసించటం ఉచిత'మని తీర్మానించి ఆ ఊరిలో స్థిరపడ్డారు.

తంజావూరుని పరిపాలిస్తున్న రాజుకి ఈ విషయం తెలియగానే, రాజు సపరివారంగా వచ్చి వారి దర్శనం చేసుకున్నాడు. ఆ ఊరిలో ఎందరో వేద పండితులు, శాస్త్రవేత్తలు ఉన్నా, వీరి తేజస్సుని చూసి వీరు 'మహాత్ములు' అని అర్థం చేసుకున్నాడు. ఇంతటి భగవత్ కృపను పొందిన మహనీయుడు తమ రాజ్యములో ఉన్నందుకు సంతోష పడ్డాడు. తమ దేశానికి శ్రేయస్సుని ఇచ్చే వీరికి ఏ విధముగానూ కష్టం కలిగించకుండా సకల సౌకర్యాలు అమర్చి ఇచ్చి తమ దేశములో ఉంచుకోవాలని ఆశించాడు. శ్రీధర్ అయ్యావాళ్ కూడా 'ఆహా! సమీపములో కావేరి నది ప్రవహిస్తున్నది, పొద్దున్నే లేచి కావేరి స్నానము ఆచరించి, గాయత్రి జపము చేస్తూ ఇక్కడే ఉందామ'ని తీర్మానించి సుఖముగా శివపూజ, శివనామ జపము చేసుకుంటూ కాలము గడిపారు. మధ్యాహ్న సమయములో ఇతిహాస పురాణాల పారాయణము, సాయంకాలము ఉపన్యాసము, భగవన్నామ సంకీర్తనము చేసుకుంటూ తనను తాను మరచి ఆడుతూ పాడుతూ భజనలో మునిగి పోయెడివారు.

తిరువిశలూర్ సమీపముగానే తిరువిడైమరుదూర్ పుణ్యక్షేత్రమున్నది. ఈ మహాలింగస్వామికి పరివార దేవతలు ఇరుగుపొరుగు ఊర్లలో ఉన్నారు. ఒక శివాలయము ఉంటే, మహాగణపతి సన్నిధి ఉంటుంది. అలాగే ఈ తిరువిడైమరుదూర్ శివాలయానికి మహాగణపతి ఎవరు? అంటే 'తిరువలంచుళి' అనబడే ఇంద్రుడు

*(మిగతా .... 17వ పేజీలో)*

# ఎందరో మహానుభావులు

## విప్రనారాయణ ఆళ్వార్లు (తొండరడిప్పొడి ఆళ్వార్)

**(గత సంచిక తరువాయి)**

ఎంత చిత్రవిచిత్రములు శ్రీరంగనాథుని లీలలు!! ఉత్తమ జన్మనెత్తి, శ్రీమన్నారాయణునికి ప్రేమతో, భక్తి శ్రద్ధలతో నందనవనం ఏర్పరచి, పుష్పవృక్షములను పెంచి, పోషించి, ఎంతో చక్కని మాలలు కట్టి శ్రీరంగక్షేత్రమున శ్రీరంగనాథునికి సమర్పించు మహాభక్తుడు మరియు బ్రహ్మచారి వేశ్యాలోలుడిగా మారుట చిత్రము కదా! ఆమె కొరకు సకలము అర్పించి, చివరకు ఆమె ఇంటి ముందు ఆమె ఒక్క కనుచూపుకై పడిగాపులు పడుట, ఇప్పుడు దొంగయను అపవాదు పొందుట విచిత్రము కదా?? వేశ్య ఇంటి పనిమనిషి ద్వారా వివరాలు తెలుసుకొని రాజభటులు పట్టుకెళ్ళి వేశ్యను ప్రశ్నించగా ఆమె "రాజుగారు! నాకు ఈ బంగారు గిన్నె ఎవరిదో తెలియదు. శ్రీరంగదాసు అను పేరు గల యువకుడు మా యింటికి వచ్చి ఈ బంగారు పాత్రను విప్రనారాయణులు పంపారని చెప్పి ఇచ్చి వెళ్లాడు" అన్నది. రాజుగారు విప్రనారాయణను పిలిచి సత్యము పలుకమని చెప్పగా వారు తను ఒక దరిద్రుడని, తన వద్ద బంగారు గిన్నెలు లేవని, అస్సలు, శిష్యులు పనివాళ్లు ఎవ్వరూ లేరని వణుకుతూ జవాబిచ్చారు. ఇద్దరి వాగ్మూలం విని పూర్వాపరాలు విచారించి రాజుగారు ఒక నిర్ణయానికి వచ్చారు. దొంగలించబడిన వస్తువును తీసుకున్నందున వేశ్య అపరాధ కానుక చెల్లించి, బంగారు గిన్నెను దేవాలయమునకు సమర్పించాలని, అలాగే శ్రీరంగనాథుని సొత్తు (బంగారు గిన్నె) అపహరణకై విచారణ వాయిదా వేసి విప్రనారాయణునికి జైలుశిక్ష అనుభవించాలని ఆజ్ఞలను జారీ చేశారు.

భక్త పరాధీనురాలైన మహాలక్ష్మి తాయారు తమ భక్తుడు విప్రనారాయణుడు పడే పాట్లను చూచి కలత చెంది మరలా శ్రీమన్నారాయణుని వేడుకొన్నది. "స్వామి! లీలామూర్తి! ఇక మీ లీలలు కట్టి పెట్టి తమ భక్తుడని కరుణతో చూడవలెను" అన్నది దయామూర్తి శ్రీదేవి. ఆ రోజు రాత్రి శ్రీరంగనాథుడు రాజుగారి కలలో ప్రత్యక్షమై వేశ్యాలోలుడైన ఆ సద్బ్రాహ్మణుని కర్మను పోగొట్టుటకై స్వయంగా నేను బంగారు గిన్నెను తీసుకెళ్ళి వేశ్యకిచ్చి అతడిని దొంగలా చేసి దండించాను. నిజంగా అతడు దొంగకాదు. నిర్దోషి" అన్నాడు. రాజుగారు మరునాడు తన స్వప్న వృత్తాంతమును రాజ పురోహితులకు, మంత్రులకు వివరించి విప్రనారాయణుని విడుదల చేసి పంపి వేసినారు.

ఈ సంసార బంధము నుండి విడుదల పొందుటకై విప్రనారాయణుడు తన

ప్రవర్తనకు సిగ్గుపడి, పశ్చాత్తాపము చెంది, పరిహారము చేయు ప్రయత్నములు చేసి, విబుధులను ప్రార్థించారు. వారు వివిధ గ్రంథములు చదివి "సకల పాప పరిహారము మరియు ప్రాయశ్చిత్తములకు శ్రీభాగవతుల శ్రీపాద తీర్థము స్వీకరించుటయే" అని నొక్కి చెప్పగా విప్రనారాయణుడు అలాగే చేసి పరిశుద్ధులైనారు. భాగవత, భగవత్ భక్తి తత్పరులైన విప్రనారాయణుడు అనేక గ్రంథములు క్షుణ్ణంగా చదవి, సాధన చేసి, శ్రీవైష్ణవుల శ్రీపాద ధూళిగా (తొండరడిప్పొడి ఆళ్వార్లు) తనను మార్చుకొని భాగవతులకు అనేక కైంకర్యములు స్వచ్ఛందంగా చేయసాగారు.

కొంతకాలమునకు శ్రీరంగనాథస్వామి తొండరడిప్పొడి ఆళ్వార్లకు తత్త్వజ్ఞానములు బోధించి తన పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతార వైభవములను తేటపరచగా, ఆళ్వార్లు శ్రీమన్నారాయణుని అర్చావతారములలో మిక్కిలి ఉత్సాహము, అభిమానాదులు ప్రదర్శించి, అందునా అర్చామూర్తులలో శయన భుజంగ అమోఘమూర్తి యైన శ్రీరంగనాథునిపై మక్కువ పడి, తన ఆనందానుభవములను పాశురముగా "తిరుమాలై, తిరుప్పళ్ళి ఎళుచ్చి" అను దివ్య ప్రబంధములుగా మలచి, ముందు తరాలకు మార్గదర్శకుడిగా నిలిచి 105 సం॥ కాలము శ్రీరంగ క్షేత్రములోనే జీవించి ఉండి పరమ పథము చేరిరి.

విప్రనారాయణుడు తన ప్రేమకుదాసుడై, రాజుగారి దండన నుంచి విడుదలై తొండరడిప్పొడి ఆళ్వారుగా మారినారను వార్త వినిన దేవదేవి (వేశ్య), తన ప్రవర్తనకు చింతించి, తన ఆస్తినంతటిని శ్రీరంగనాథునికి సమర్పించి పరమ సాత్త్వికురాలుగా మారిపోయినది. శ్రీరంగనాథస్వామి దేవాలయమును శుభ్రము చేయుట, ముగ్గులు వేయుట, దీపములు వెలిగించుట మొదలగు సేవలు చేస్తూ పుష్పమాలికలు కట్టి సమర్పిస్తూ, సదా శ్రీరంగనామ స్మరణ చేయుచూ, తన పాపములను పోగొట్టుకొని, కొంతకాలానికి కర్మఫలముగా సద్గతిని పొందినది.

భక్తాంఘ్రి రేణువులును పుష్పమాలలుగా చేసి, శ్రీరంఘనాథునికి అర్పించుచు అసమాన భక్తి వైరాగ్య నిష్ఠాగరిష్ఠులై దేహాస్తమున తన అవతారమునకు అంశమైన శ్రీమన్నారాయణుని "వనమాల"యందు తొండరడిప్పొడియాళ్వార్లు సాయుజ్యమందిరి. వీరి రచనలు శ్రీరంగనాథుని సంబోధించి యున్నవి. మరియే ఇతర విష్ణుమూర్తులను గూర్చి వీరు పాడలేదు. వీరి ప్రార్థనా శ్లోకం:

*"త్వమేవ మత్వా పరవాసుదేవం రంగేశయం రాజ వదర్హణీయం*
*ప్రాబోధకీం యోకృత సూక్తిమాలాం భక్తాంఘ్రి రేణుం భగవన్తమీడే"*

***తెలుగు అనువాదం: శ్రీమతి సీతా దేశికన్***

# చిన్నారులకు ఓ కథ

## మహాభక్తుడు - యోగి శ్రీగణేశనాథుడు

జై రాధే రాధే! జై ద్వారకాదీశా! అందరూ వచ్చేసినట్లేనా! ఈ రోజు మనము ఒక మహాభక్తుని కథ చెప్పుకొందాము.

మహారాష్ట్రలో సారసి అనే గ్రామంలో గణేశనాథుడు అను పేరుగల భక్తుడుండేవాడు. అతను పగటిపూటంతా ఆ వూరి దగ్గరలోనే అరణ్యములలో ఏకాంతముగా తిరుగుతూ, హరినామ సంకీర్తనము చేసుకొనే వాడు. రాత్రి వేళలందు గ్రామములో ప్రవేశించి భగవంతుని కథా సత్సంగములు చేస్తూ ఉండేవాడు. గ్రామములోని ప్రజలంతా భక్తితో వినేవారు.

ఈ గణేశనాథునికి సన్మానములన్నా, లౌకిక పూజలన్నా, డాంభిక ఆర్భాటములన్నా, రుచికరమైన మృష్టాన్న భోజనములన్నా ఇష్టముండేది కాదు.

ఆ రోజులలో మహారాష్ట్రమును ఛత్రపతి శివాజీ పరిపాలించేవాడు. శివాజీ మహారాజు ఒకసారి శ్రీపండరీపురము వచ్చి, గణేశనాథుని కీర్తి గురించి విని, ఆయనను చూసుటకు వెళ్ళెను. ఆ సమయములో గణేశనాథుడు హరినామ సంకీర్తన చేయుచుండెను. శివాజీ మహారాజు ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసి, హరి సంకీర్తనమును వింటూ కూర్చున్నాడు. గణేశనాథుని అపార జ్ఞానమును, రసవత్తరమగు కవిత్వమును, ఉపదేశ వాక్యములను విని, శివాజీ మరియు అక్కడ ఉన్న శ్రోతలు అందరూ కూడా చాలా సంతోషమును పొందిరి. అప్పుడు శివాజీ మహారాజు గణేశునితో "స్వామీ! నేను శయనించుటకు ఒక మంచమును తయారు చేయించుకొన్నాను. మీరు నా రాజభవనానికి విచ్చేసి, ఒక్కసారి ఆ మంచముపై నిద్రించవలసిందిగా కోరుచున్నాను" అని ప్రార్థించాడు.

శివాజీ కోరిక ప్రకారము, వైరాగ్యశీలుడగు గణేశనాథుడు కొన్ని కంకర రాళ్ళను మూటకట్టుకొని మహారాజు వెంట వెళ్ళాడు. శివాజీ మహారాజు తన భవనంలో గణేశనాథునికి సకల అతిథి మర్యాదలు జరిపి, తన శయన మందిరమునకు తీసుకొని వెళ్ళెను. మహారాజు మంచముపై పట్టు పరుపులు వేసి, పువ్వులు జల్లి, నాలుగు వైపులా తెరలు కట్టి, ఆ మంచముపై నిద్రింపుమని గణేశనాథుని ప్రార్థించెను. గణేశనాథుడు భుజించుటకు అనేక ఫలములను, మంచి సుగంధ భరిత పరిమళ

ద్రవ్యములను అచట ఉంచెను.

గణేశనాథునికి ఆ మంచముపై నిదురయే పట్టలేదు. పంజరములో బంధించిన చిలుకలాగా ఉంది ఆయన పరిస్థితి. అప్పుడు గణేశ నాథుడు తన వెంట తెచ్చుకున్న కంకర రాళ్లను ఆ పట్టు పరుపుమీదున్న పువ్వులపై పోసి పడుకొని నిదురించాడు.

ప్రాతఃకాలముననే శివాజీ మహారాజు వచ్చి గణేశునికి సాష్టాంగ నమస్కారం చేసి, మంచముపై నున్న రాళ్ళను చూసి ఆశ్చర్యపడి, కారణమేమిటని అడిగెను. అప్పుడు గణేశుడు రాజుతో, “రాజా! ఆ మంచమ్మీది పట్టు పరుపులపై నిద్రించినచో గాఢ నిద్ర పడుతుంది. దానివలన జీవితమందు సుఖము లభించి, ముందుముందు దారుణమైన కష్టములను కూడా పొందవలసి ఉంటుంది. భుజించుటకు పదార్థములు చాలా మధురంగా ఉంటాయి. కానీ అవి జీర్ణం కావటం కష్టమవుతుంది. నీ కోరిక తీర్చుటకు నేను ఆ మంచంపై రాళ్లు పోసుకొని నిద్రించితిని. ఈ విషయ భోగములు యథార్థముగా దుఃఖము అని తెలుసుకొనుము” అని చెప్పెను. అది వినిన శివాజీ మహారాజు, ఆ రోజు నుండి తాను మంచముపై పడుకోవటము మాని, ఆ మంచమును నిశ్చల చిత్తముతో బ్రాహ్మణులకు అర్పించాడు.

క్రమముగా గణేశనాథుడు, వైరాగ్య భరితుడై గ్రామములో ఉండక, అరణ్యములలోనే నివసించుచుండెను. అతనిని దర్శించుటకు జనులు అధిక సంఖ్యలో అడవికే వచ్చెడివారు. ఆశీస్సులు కోరి వచ్చిన వారికి గణేశనాథుడు తన చేతిని వారి శిరస్సుపై నుంచి ఆశీర్వదించెడి వాడు. వెంటనే వారికి అపార వైరాగ్య భావములు కలుగుచుండేవి. కొంతమంది గణేశుని మీద అపనమ్మకంతో ఏవో మాయ మంత్రాలతో, ప్రజలను వశపరచుకొని, గృహస్థులను నాశనం చేస్తున్నాడని అనుకునే వారు. కొంతమంది స్వయంగా పరీక్షించి, గణేశునితో మాట్లాడి అసలు విషయం, నిజం తెలుసుకోవాలని అడవికి బయల్దేరారు.

ఆ సమయం గణేశుడు ధ్యాన సమాధిలో ఉన్నాడు. అతను కళ్ళు తెరిచిన వెంటనే, పరీక్ష చేయుటకు వచ్చిన వారు గణేశనాథునితో “నీవు అమాయకుల నెందరినో శిష్యులుగా చేసుకొని అనేక సంసారములను మంటకలిపావు. నీ వలన ప్రజలకు కష్టములు కలుగుచున్నవి. నీవు విరక్తుడవు. ఆత్మ జ్ఞానివి కదా! నీ దృష్టికి సర్వము సమానమే కదా! అయితే ఇక్కడి చెట్లకు కూడా ఉపదేశమలు చెయ్యి, చూస్తాము” అన్నారు. వెంటనే గణేశనాథుడు అచ్చట గల పురాతన వృక్షమునకు (మామిడి చెట్టు) తారక మంత్రమును ఉపదేశించెను. “సరే! మీ ఉపదేశము వలన,

ఈ మామిడి చెట్టుకు ఎటువంటి అనుభవం కలుగునో దయచేసి మాకు చెప్పండి" అన్నారు పరీక్ష చేసే దుర్జనులు.

వాళ్ళ పరీక్షలో భాగంగా, నివేదనకు తెచ్చిన ప్రసాదమును గణేశునికిచ్చారు. గణేశుడు ప్రసాదమును పుచ్చుకొని, తాను ఉపదేశము చేసిన వృక్షముతో "ఇది భగవత్ ప్రసాదము. కనుక ప్రీతితో భుజింపుము" అన్నారు. వెంటనే ఆ మామిడి చెట్టు మ్రానిలో అందరూ చూస్తుండగానే ఒక తొఱ్ఱ ఏర్పడింది. గణేశుడా తొఱ్ఱలో ప్రసాదము వేయగానే మరల అందరూ చూస్తుండగానే ఆ తొఱ్ఱ పూడిపోయెను. వెంటనే ఆ దుర్జనులు గణేశుని పాదములపై పడి "స్వామీ! మేము అహంకారంతో మిమ్ములను అవమానించాలని వచ్చాము. మీరు నిర్మల హృదయులగు జ్ఞాని, యోగి, మా తప్పులు క్షమించండి" అని ప్రార్థించారు. గణేశుడు చిరునవ్వుతో వాళ్ళను ఆశీర్వదించి పంపాడు.

ఒక రోజున అడవిలో గణేశ నాథుడు భగవంతుని కథా కాలక్షేపము చేస్తుండగా అది వినుటకై ఎందరో పండితులు, శ్రీ వైష్ణవులు, వేదపండితులు, అన్ని వర్ణముల ప్రజలూ వచ్చారు. అనేక వాయిద్యములతో హరిసంకీర్తన ప్రారంభమైనది. గణేశ నాథుడు చేతులు పైకెత్తి తాళం వేస్తూ సంకీర్తన చేయుట ప్రారంభించెను. వెంటనే అచ్చటగల పండితులు అతనిని చూసి "నీవు హీన జాతివాడవు. మేము అగ్రజాతి యందు జన్మించిన బ్రాహ్మణులము. నీ ఆజ్ఞానుసారముగా మేము కరతాళములు వేస్తూ సంకీర్తన చేయము" అన్నారు.

అప్పుడు గణేశుడు "మనకంటే కూడా ఈ తాటిచెట్టు చాలా ఎత్తుగా ఉన్ననూ, దాని నీడ మనకెవరికీ ఉపయోగపడదు. అట్లాగే, అన్ని వర్ణములలో బ్రాహ్మణులు గొప్పవారై వుండిననూ, పూజనీయులై ఉండిననూ, హరినామ సంకీర్తన చేస్తున్నప్పుడు వారి చేతులు తాళము వేయుటకు ఉపయోగపడుట లేదు. కాబట్టి మీరు సంకీర్తన చేస్తూ ఉండండి, ఈ పాషాణములు (రాళ్ళు) మీ దయవలన కరతాళము వేస్తున్నట్లుగా ఎగురుచూ, ఒకదానినొకటి కొట్టుకొనును" అని అనెను. అప్పుడా బ్రాహ్మణులు తాము సంకీర్తన చేయుట ప్రారంభించగా, ప్రక్కనేగల రాళ్ల రప్పలు ఒకదాని నొకటి శబ్దము వచ్చునట్లుగా కొట్టుకొనుచుండెను. అక్కడ ఉన్న వారందరూ ఈ వింతను ఆశ్చర్యముతో చూచుచుండిరి.

అంతట అచట గల బ్రాహ్మణులు అందరూ, గణేశనాథుని మహిమలకు ఆశ్చర్యపడి, తాము అగ్రవర్ణము వారను అహంకారమును వదలి, తాము కూడా

కరతాళములు వేయుచూ సంకీర్తన యందు పాల్గొనిరి. సంకీర్తన పూర్తయిన తరువాత, వారందరూ మనస్ఫూర్తిగా శ్రీగణేశనాథునికి నమస్కరించి, ఆయన ఆశీస్సులు పొంది, తమ తమ ఇళ్ళకు వెళ్ళిరి.

శ్రీ పండరినాథుడు, ఈ భక్తుని అనుగ్రహించి, వారు నివసించిన సారసి అను గ్రామమును మహాక్షేత్రముగా చేసిరి. ఇప్పటికి సజ్జనులు, యోగీశ్వరులు ఆ క్షేత్రమును దర్శించుకొంటున్నారు. భగవంతుడు తన నిజ భక్తుల కీర్తిని ఈ విధంగా వ్యాపింప చేస్తాడు.

పిల్లలూ! ఈ కథ వలన మనము తెలుసుకోవలసిన నీతి ఏమిటంటే; అగ్రవర్ణాలూ, అహంకారాలూ వదిలిపెట్టి, మానవులలోనే కాదు. సకల ప్రాణులలోనూ భగవంతుని తత్త్వమునే చూడాలి. కులం కులం అని కుమ్మలాటలొద్దు. సర్వజీవులలోని చైతన్యం ఆ భగవంతుడేనని తెలుసుకోవాలి. ఈ సత్యాన్ని, మంచితనాన్ని పెంచుకోవటానికి హరినామ సంకీర్తనము, స్మరణము తోడ్పడుతాయి. మరి అందరం కలిసి మహామంత్ర నామ స్మరణం చేద్దామా!

**హరే రామ హరే రామ రామ రామ హరే హరే**
**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే**

– శ్రీమతి వై.అమ్మణి

## "మధురమురళి" భక్తి మాస పత్రిక చందా వివరములు

చెక్కులు, డి.డి.లు Sri Sandeepani Gurukula Seva Trust (A.P.) పేరున తీసి పంపవలెను. హైదరాబాద్ తప్ప ఇతర ప్రాంతముల వారు డి.డి.లు మాత్రమే పంపవలెను అని మనవి. **చందాలు పంపవలసిన చిరునామ:**

**Sri Sandeepani Gurukula Seva Trust (A.P.)**
2nd Floor , Shyam Apartments,
6-3-563/ F, Erramanzil, Hyderabad -500 082
Ph : 98480 - 24928/ 040-23392758,
23315150.
email:lataravi@hotmail.com
Related websites : www.madhuramurali.org/
www.namadwaar.org

విడి ప్రతి రూ.10/-
సంవత్సర చందా
(12 ప్రతులు) రూ.120/-

# భక్తుల ప్రశ్నలు - శ్రీ స్వామీజీ సమాధానములు

*(శ్రీస్వామీజీ దగ్గర భక్తులు అడిగిన ప్రశ్నలకు శ్రీ స్వామీజీ ఇచ్చిన సమాధానములు)*

**ప్రశ్న** : ప్రాణము యొక్క ఉత్పత్తి స్థానము, మనస్సు యొక్క ఉత్పత్తి స్థానము ఒకటే. మనస్సు అణగినప్పుడు ప్రాణము కూడ అణగి వుంటుంది. ప్రాణము అణగినప్పుడు మనస్సు కూడ అణగి వుంటుంది. కానీ మనోలయము అయిన జ్ఞానికి విదేహ ముక్తి పొందే వరకు ప్రారబ్ధము వలన ప్రాణము అంటి పెట్టుకొని ఉండునని అంటారు కదా! జ్ఞానికి మనస్సు లేనప్పుడు ప్రాణము ఎట్లు పైకి లేచును ?

**శ్రీ స్వామీజీ** : ఒక హ్యాండు పంపు కలదు. దానిని ప్రతిసారి కొట్టినప్పుడు నీరు భూమి నుండి పైకి వచ్చును. పంపు కొట్టటము ఆపివేసినప్పుడు భూగర్భములో నీరు ఉన్నప్పటికి పైకి రాదు. (భూమి క్రింద నీరు లేనప్పటికి మనము పంపు కొట్టవచ్చును, కానీ నీళ్ళు పైకి రావు.) అదే విధముగా మనోలయమైన జ్ఞానికి ప్రాణ సంచారము ఉన్నప్పటికి మనస్సు పైకి లేవదు.

**ప్రశ్న** : మీ దర్శనార్థము వచ్చినప్పుడు ''యిప్పుడే మీ గురించి అనుకుంటున్నాను. అంతలో మీరే వచ్చేశారు" అని అంటారు. ఇదే విధముగా చాలా మందితో మీరు అంటుంటారు. ఎల్లప్పుడు మీ గురించే ఆలోచన అని అంటుంటారు. ఇట్లు చెప్పటము ఏదో ఉపచార మాటలు అంటున్నారేమోనని అనిపించుచున్నది. లేక నిజముగానే తలచు కొన్నారా?

**శ్రీ స్వామీజీ** : మీరు అంటున్నది పొరపాటు. ఒకే సమయమునందు అనేకులను గురించి నేను ఆలోచించగలను. చిన్న పాత్రయందు వస్తువు కొద్దిగానే పట్టును. అదే పెద్దపాత్ర దాని పరిమాణమునకు తగినట్లు ఎక్కువగా పట్టును. అలాగే మహాత్ములు ఒకే సమయము నందు అనేక మందిని గురించి ఆలోచించగలరు.

**ప్రశ్న** : భక్తి మార్గమును అనుసరించే వారు కర్మానుష్ఠానము చేసే వారిని, వేదాంత విచారణ చేసే వారిని, యోగ సాధన చేసే వారి యొక్క

దోషములను ఎత్తి చూపించి పరిహసించెదరు. భక్తి మార్గము ననుసరించే వారిలో ఎట్టి దోషములు లేవా?

**శ్రీ స్వామీజీ :** భక్తి మార్గమును అనుసరించే వారిలోను దోషములు వుంటాయి. అయితే, కర్మ, యోగ, జ్ఞాన మార్గములను బోధించిన వారే ఈ మార్గములను, దానికి విధించిన నియమములను అనుసరించినప్పుడే తగిన ఫలితము లభించునని, దోషములతో కూడిన అనుష్ఠానములకు విపరీత ఫలితములు కలుగునని చెప్పియున్నారు. భక్తి గ్రంథములలో మాత్రము పరిహాసముగా గాని, హేళనగాగాని, సంకేతముగా నైనను, భగవన్నామములను ఉచ్ఛరించినంత మాత్రమున పూర్ణ ఫలము లభించునని చెప్పబడినది. శ్రీమద్భగవద్గీత యందు భగవానుడు “నా పట్ల నిజమైన భక్తి కలిగినట్లయిన యెడల అతనిలో ఎటువంటి దోషములున్నప్పటికి అతను నా భక్తుడే. అతనిని త్వరలో ధర్మాత్మునిగా మార్చివేయుదును” అని చెప్పియున్నారు. భక్తులకు ఎప్పటికి నాశనము లేదు.

**ప్రశ్న :** వేణువు వూదుచున్న శ్రీకృష్ణుని పటమును యింట్లో ఉంచుకొనవచ్చునా? అటువంటి పటమును ఉంచుకుంటే ఇంటిని ఊదివేస్తాడని కొందరు అంటున్నారు?

**శ్రీ స్వామీజీ :** ఎందుకు ఆపివేశారు? ఇంకను పర్వతమును ఎత్తుకొన్న ఆంజనేయుని పటమును ఉంచుకొంటే ఇంటినే ఎత్తివేస్తాడని, వినాయకుని పటమును ఉంచుకొంటే పుత్రులకు వివాహము కాదని, నరసింహ స్వామి పటమును ఉంచుకొంటే ఇంటిని రెండుగా చీల్చి వేస్తాడని, కన్యాకుమారి అమ్మవారి పటమును ఉంచుకొంటే అమ్మాయిలకు వివాహము కాదని, శ్రీరాముని పటమును ఉంచుకొంటే భార్యను ఎవరైనా ఎత్తుకొని వెళ్తారని, ఈ విధముగా ఎన్నో రకములుగా ఊహించుకొని ప్రచారము చేస్తుంటారు. ఇవి అన్నియు కాలక్షేపము కొరకు మాట్లాడే మాటలే అగును.

**ప్రశ్న :** మీ ఉపదేశ వాక్యముల యందు మనిషికి దుఃఖము కలిగినప్పుడు భార్య, పిల్లలు, సంసారము అక్కరలేదని అనిపించదు కాని

సత్సంగములు, గురువు అన్ని అక్కరలేదని అనిపిస్తుంది. దానికి కారణము ఈ విషయములు అతి తక్కువ ప్రాధాన్యత (least important) కలిగినవి కావటమే అని అంటారు కదా! దీనిని నేను ఒప్పుకొనను. ఏదో ఒక ఫలితమును ఆశించి దైవ కార్యముల యందు పాల్గొంటాము. అవి నెరవేరనప్పుడు ఆ విధముగా అనుకొనుటములో తప్పేమిటి?

**శ్రీ స్వామీజీ :** భార్యా, సంతానము, కుటుంబము పట్ల కూడా ఏదో ఎదురు చూపులతోనే ఉంటారు. కాని మీకు అనుగుణముగా వారు లేనప్పటికి వారిని వదలి వేయలేరు కదా? వారిని వదలలేనందకు కారణము వారి పట్ల మీకు గల "మమకారమే". అటువంటి మమకారము భగవంతుని పట్ల కలగాలనే ఉద్దేశముతో చెప్పినదాంట్లో తప్పేమీ లేదనుకొంటాను?

**ప్రశ్న :** ఆధ్యాత్మిక విషయములను బలవంతముగా ఒకరిపై రుద్దవచ్చునా?

**శ్రీ స్వామీజీ :** తల్లి చేదుమందును పసిపిల్లవాడు త్రాగటానికి మారాము చేసినప్పుడు, బలవంతముగా కష్టపడి ఏ విధంగా త్రాగించునో, అదే విధముగా సద్విషయములను బలవంతముగా నైనను రుద్దటములో తప్పేమి లేదు.

**ప్రశ్న :** ప్రస్తుత కాలము నందు అనేక ధర్మ కార్యములు జరుగుచున్నవి కదా!

**శ్రీ స్వామీజీ :** ప్రస్తుత కాలము నందు అనేక కార్యములు జరుగుచున్నవని చెప్పవచ్చును. కాని ఆ ధర్మకార్యములు ధర్మమార్గమున జరుగుట లేదు.

***తెలుగు అనువాదం: శ్రీమతి హెచ్.కమల శర్మ***

**భక్తులకు విజ్ఞప్తి**

*మా మాసపత్రిక ఉచితముగా (Sample) యిచ్చినట్లయితే, అది మీకు నచ్చినట్లయితే తప్పకుండా చందాకట్టి ప్రతి మాసపత్రికను చదివి తరించగలరు. చందా వివరాలు పత్రికలో లభించును.*

# శ్రీ స్వామీజీ యొక్క సంభాషణముల నుండి

(భగవాన్ శ్రీరమణమహర్షి యొక్క అరుణాచల అక్షరమణమాలై - శ్రీ స్వామీజీవారి ఉపన్యాసముల నుండి కొన్ని భాగములు)

**(గత సంచిక తరువాయి)**

భగవంతుని అనుగ్రహమును సంపూర్ణముగా పొందిన వారిలో కామ, క్రోధ, భయములనే వికారములు అగుపడవు. ఇదియే వారు భగవంతుని యొక్క అనుగ్రహమును పొందియున్నారనుటకు సాక్ష్యము. భగవంతుని అనుగ్రహము పొందిన వారే ఇంతటి ఉత్తములుగా మార్పు చెందెదరంటే, భగవంతుడు యింకా ఎంతటి ఉత్తమోత్తముడుగా యుండవలయును?

అద్వైత సిద్ధాంతము ననుసరించి పశుపక్ష్యాదుల నుండి జగత్తునందలి సకల జీవరాశులు ఈశ్వర స్వరూపములే. అలాంటప్పుడు ఒక జ్ఞానిని కాని, ఒక దైవమును కాని, ధ్యానించవలసిన అవసరమేమున్నది? వేదములు కూడ మాతృదేవోభవ, పితృదేవోభవ అని భోదించుచున్నప్పుడు, మాతాపితరులను ధ్యానించవచ్చును కదా! లేక మీకు ప్రియమైన వారిని ధ్యానించవచ్చును కదా అని కొందరు ప్రశ్నించవచ్చును.

అనుభవము నందు సర్వము బ్రహ్మమయమనునది సత్యమే అయినప్పటికి, వ్యవహారము నందు అది కుదరదు. ఉపాసన, ధ్యానము నందు ఏ విషయమును ఏకాగ్రముగా చింతించెదమో, ఆ వస్తువుగా మారిపోవుదుము. మనము ధ్యానించే మూర్తి యొక్క గుణములు మనకు సంక్రమించును. వ్యవహారము నందు జ్ఞానులు తప్ప మిగిలిన వారందరు శోక మోహములకు వివశులై యుందురు. కాబట్టి అట్టి వారిని ఉపాసించిన యెడల వారి యొక్క గుణములు మనకు సంక్రమించును. కావున మనము ఉపాసించే దైవము పూర్ణ బ్రహ్మ స్వరూపముగా ఉండవలయును. అరుణాచలేశ్వరుడు అటువంటి దైవము.

**కోపమిల్ గుణతోయ్ కురియాయ్ ఎనైకొళ్।**
**కురై ఎన్ శెయ్‌దేన్ అరుణాచలా॥ 25**
**కోపరహిత గుణ గురిగాగ నను‌గొను।**
**కొఱయేమి చేసితి నరుణాచలా॥ 25**

నేను నీ బిడ్డను. నీవు కోపరహితుడవైన నా తండ్రివి. నిన్ను అనేక విధములుగా స్తుతించి, విలపించి, దుఃఖించినప్పటికి నీవు నా పట్ల దయ చూపించకపోవటము గమనించిన యెడల, నీకు నా పట్ల ఆగ్రహము కలిగినట్లు అనిపించుచున్నది.

కోపమే రాని నీకు నాపై అంతటి ఆగ్రహము కలిగినదంటే, నేను చేసిన పొరపాటు ఎంతటిదై యుండవలయును? నేను అజ్ఞానము వలన పొరపాటు చేసి యుండవచ్చును. జగత్తు నందు ప్రేమలేని సంతానము ఉండవచ్చును. కాని తమ సంతానము పట్ల అనురాగము లేని తల్లిదండ్రులు అరుదు కదా! నా పొరపాటును మన్నించి, నన్ను అనుగ్రహించి నాపై అనుగ్రహమును వర్షించమని ప్రార్థించుచున్నాను.

యింకొక భావమును గమనించిన యెడల "కోపమే లేని అరుణాచలేశ్వరా! జగత్తులో ఎందరో భక్తులు తమ అనుగ్రహము కొరకు అనేక విధములైన ఉపాసనలు, తపస్సులతో తపించుచుండగా, నీవు నన్ను కరుణించి అనుగ్రహించితివి కదా! అందులకు నేను చేసిన తపమెంతటిది?" అని ప్రశ్నించుచున్నారు.

కుఱై (కొఱ) అంటే తపస్సు అని అర్థము కూడా కలదు.

*(సశేషం)*

***తెలుగు అనువాదం: శ్రీమతి హెచ్.కమల శర్మ***

## శ్రీ సద్గురు అమృతవాణి

*(6వ పేజీ తరువాయి)*

పూజించి తరించిన 'సముద్రపు నురుగు'తో చేయబడిన వినాయకుడు ఈ తిరువిడై మరుదూర్ మహాలింగానికి (పరివట్టార్) పరివార దేవత. 'స్వామిమలై' స్వామినాథ స్వామి; 'కదిరామంగళం' దుర్గాదేవి; 'ఆలంగుడి' దక్షిణామూర్తి; 'చిదంబరం' నటరాజూ – ఇలా పరివార దేవతలు పెద్దపెద్ద గుడులలో కొలువై ఉన్నారు. అంతటి విశేషమైన శ్రేష్ఠమైన ఆలయము ఈ 'తిరువిడైమరుదూర్' దేవాలయము. తిరువిశలూర్ గ్రామము, తిరువిడైమరుదూరుకి సమీపాన ఉన్నందువలన, ప్రతిదినము సాయంత్ర సమయాన ఆలయానికి వెళ్ళి మహాలింగస్వామిని దర్శించెడి వారు శ్రీధర అయ్యావాళ్.

***తెలుగు అనువాదం: శ్రీమతి రాజి రఘునాథన్***

# శ్రీమద్భాగవతము - ప్రథమ స్కంధము

....శ్రీ స్వామీజీ

## ముందుమాట

"శ్రీమద్భాగవతం స్వయం హరిరేవ" సాక్షాత్ భగవానుడే శ్రీమద్భాగవతము అని ఒక కీర్తనము నందు శ్రీ స్వామీజీ వక్కాణించి పాడి యున్నారు. ఎంతో విశిష్టమైన ఆ పుణ్య గ్రంథము యొక్క మహాత్మ్యమును సులభముగా అందరూ అర్థము చేసుకొనుటకు సాధ్యముగా శ్రీస్మామీజీ వారి వ్యాఖ్య పలు భాగములుగా మనము ఆస్వాదిస్తున్నాము. ఇప్పుడు ప్రథమ స్కంధమునకు శ్రీస్వామీజీ వారి వ్యాఖ్యానము తెలుగులో అనువాదము చేసే భాగ్యము "మధుర మురళి"కి ప్రాప్తమైనది.

శ్రీ వేదవ్యాసుల వారిచే రచించబడిన "నామ సిద్ధాంతమే" శ్రీమద్భాగవతము అని శ్రీస్వామీజీ పొగడుతుంటారు. "నామ పురాణము" అని శ్రీమద్భాగవతమును ఎన్నో భావములతో, దృక్కోణములతో, రసముగా శ్రీస్వామీజీ వ్యాఖ్యానము చేస్తుంటారు.

శ్రీస్వామీజీ వారిని నమస్కరిస్తూ శ్రీ మాధురీ సఖీ సమేత శ్రీ ప్రేమిక వరుధుని పాదకమలములందు ఈ ప్రయాసమును సమర్పించుచూ, భక్తులందరూ ఈ ఆనందమయమైన గ్రంథము యొక్క ప్రత్యేకమైన వ్యాఖ్యానము ననుభవించు భాగ్యమును పొందవలెనని ప్రార్థన.

## పరిచయం

చతుర్వేదాలను సంగ్రహించి మానవజాతికి ప్రసాదించిన మహనీయుడు శ్రీ వేదవ్యాసుడు. మహత్తరమైన మహాభారతమును, వేదాంతమైన ఉపనిషత్తులను, మహాభారత సారమైన శ్రీభగవద్గీతను, బ్రహ్మ సూత్రములను ఈ లోకానికి యిచ్చినది శ్రీవేద వ్యాసుడే.

బ్రహ్మ సూత్రములు ప్రత్యేకముగా ముముక్షువులకు అని భావించవచ్చును. ముముక్షువు అంటే "మోక్షకాంక్ష" మాత్రమే వున్న వారిని సంకేతించును. మోక్షమును ఆకాంక్షించువారు రెండు విధములుగా వుంటారు. మొదటి వర్గము రసిక హృదయము

గల వారు. మరొక వర్గము రసిక హృదయము లేని వారు. రెండవ వర్గం వారికి బ్రహ్మసూత్రాలు ప్రయోజనకరముగా వుంటాయి అని అర్థము చేసుకున్న శ్రీ వేదవ్యాసుడు, రసిక హృదయము గల ముముక్షువులకు ఆత్మజ్ఞానాన్ని ఎలా బోధించవలయునని ఆలోచిస్తూ, సమాధానముగా రసికత్వముగల ముముక్షువులకు మాత్రమే గాక, సంసారులకు కూడా లాభము ప్రసాదించు మార్గాన్వేషణ చేసిరి.

అంతటితో ఆగక కలియుగము నందు జనించు జీవులకు ఏకైక గతిగా యున్న "నామ కీర్తనము"ను ఈ గ్రంథము మూలంగా స్థాపించవలయునని సంకల్పించిరి. అద్వైతులు, విశిష్టాద్వైతులు, ద్వైతులు – ఏ సాంప్రదాయమునకు చెందిన వారికైన ఈ గ్రంథము సమ్మతముగా వుండవలయునన్నది మరియొక సంకల్పము! ఒకే రాయితో రెండు మామిడికాయలు వ్రాల్పించినట్లుగా నిగమము (వేదము) అన్న కల్పవృక్షము యొక్క రసోత్తరమైన పండుని "శ్రీమద్భాగవతము" అని మనకి ప్రసాదించిరి!

శ్రీ వేదవ్యాసుడే నామ సిద్ధాంతము చేసిన అగ్రణీయులు. వారు చేసిన నామ సిద్ధాంతమునకు "శ్రీమద్భాగవతము" అని పేరు. ఈ మాటను వ్యాసుల వారే మనకి భాగవతమునందు సూచిస్తున్నారు. పరిక్షిన్నరేంద్రుడు గంగా తీరమున శుకముని దర్శనానంతరం ఆ బ్రహ్మజ్ఞానిని "నా ఆయుర్దాయము ఇక కేవలం ఏడు రోజులే. సద్గతి పొందుట ఎలా?" అని ప్రశ్నించెను. తపిస్తున్న పరిక్షిన్నరేంద్రునికి ఆశ్వాసం ఇచ్చిన శుక బ్రహ్మ "రాజన్! బెంగ పడకు! వేదానికి తుల్యమైనది, వేదాలకు సమ్మతమైన ఒక గ్రంథం వున్నది. అది నీ సంసార తాపాన్ని నివారిస్తుంది" అని చెప్తూ అప్పుడు "ఇదం భాగవతం నామ పురాణం బ్రహ్మ సమ్మితం" అని అంటారు. దీన్ని మనము "ఇదం భాగవతం, నామపురాణం, బ్రహ్మ సమ్మితం" అని విడదీసి చూస్తే ఈ సంహితకు "శ్రీమద్భాగవతం" అని పేరు, భగవన్నామ మహిమను తెలుపుటకు, ఉద్ఘోషించుటకు అవతరించిన పురాణము, వేదాలన్నింటికి తుల్యమైనది" అన్న అర్థము స్పష్టముగా కనిపిస్తుంది. అందుకే ముందుగా అనుకున్నాము. వేదవ్యాసుడు స్థాపించిన నామ సిద్ధాంతము "శ్రీమద్భాగవతము" అని.

*(సశేషం)*

***తెలుగు అనువాదం: శ్రీమతి లతా రవిచంద్రన్***

# భక్త మీరా

## బృందావనము - నందకుమారుదు

- శ్రీ స్వామీజీ

(గత సంచిక తరువాయి)

మీరాబాయి చెవులకు "బృందావనం" అనుమాట తేనెలా, మధురగీతంలా... సాక్షాత్తు కృష్ణదర్శనంలా వినిపించి, ఆమెను మరలా, మరలా మైకంలో మునిగి, లేచి మరలా "బృందావనం" అను అమృత వాక్కు విని మరలా ఆనంద పారవశ్యంలో మునిగి సొమ్మసిల్లి స్పృహ తప్పేలా చేసింది. ఏడు రోజుల తరువాత పూర్తిగా స్పృహలోకి వచ్చిన మీరా గురు రాయ్‌దాస్ గారిని నమస్కరించి "గురుజీ! తమరి కృపవలన నా హృదయంలో తమరు నాటిన కృష్ణభక్తియను బీజం అంకురించి, చిగురులు వేసి, మూడు పూలు, ఆరుకాయలుగా పెరుగుటకు నేనెంత పుణ్యం చేశానో కదా!" అన్నది.

దానికి గురువుగారు "అమ్మా! నేను కాదు సాక్షాత్తు ఆ గిరిధారే ఆ బీజానికి కారకుదు. నీ సాటిలేని దృఢభక్తిలో కొన్ని బిందువులు నాకు అనుగ్రహించు" అన్నారు. మీరా ఎంతో ప్రశాంతంగా తన గిరిధారికి మాలలు అల్లి, సమర్పించి, ప్రీతితో భజనలు చేస్తూ, గురువు గారికి శుశ్రూషలు చేస్తూ బృందావనంలో సంతోషంగా విహరించింది. గురువుగారు గిరిధారికి పూజలు చేస్తూ వుంటే మీరా తంబురా మీటతూ, కనులు మూసుకొని తన్మయత్వంతో భజనలు చేసేది. అందుకే కాబోలు రాయ్‌దాస్ గారు మీరా చిన్నతనంలోనే గిరిధారిని మీరా వద్దనే వదలిపెట్టి, ఆమెను బృందావనమునకు రప్పించే భారాన్ని గిరిధారికే ఇచ్చారు. సాధువుల బృందం "కృష్ణా! గోపాల! ఘోషంతో నామ సంకీర్తనలు చేశారు. మీరా ఇలా పాడింది.

"సంత్‌సంగ్ బైఠి బైఠి లోక్ లాజ్ కోయీ"

(సాధువుల సానిధ్యంలో మీరా ఇహలోక బంధాలను త్యజించింది)

మీరా సాధువుల సత్సంగమున తన పూర్వకాలపు బాధలను మరచి, గురువు గారి చల్లని నీడలో తన గిరిధారి పట్ల శ్రవణ, కీర్తన, స్మరణ, వందన, అర్చన, సఖ్య, దాస్య, ఆత్మ నివేదనలతో ప్రశాంతంగా, సంతోషంగా బృందావనంలో కాలం గడిపింది. అంతటి మహత్తు గురుచరణారవిందములలోనే ఉంది. గురువు గులాము అయిన శిష్యునికి ముక్తి అరచేతిలో ఉసిరికాయ వంటిదని గొప్పకవి అంటారు.

గురురాయ్‌దాస్ గారు ప్రతిరోజు ప్రవచనములు చేసే వారు. ఓక రోజు ఇలా ఉపన్యసించారు. "బృందావనంలో శ్రీకృష్ణుడు రాధాదేవితో కలిసి నిత్యనివాసం చేస్తాడు. తమ కళ్లకు 'ప్రేమభక్తి' అను అంజనం (కాటుక) పెట్టుకొని బృందావనం అంతా శ్రద్ధగా, పట్టుదలతో వెతికే భక్తులకు శ్రీరాధాకృష్ణ దర్శనం తప్పకుండా అవుతుంది. ఇది సత్యం" అని నొక్కి చెప్పారు. ఈ మాటలు మీరా హృదయంలో బలంగా నాటుకొని పోయాయి. తులసి మాల మెడలో ధరించి, సన్యాసి వస్త్రధారణలో శ్రీకృష్ణ దర్శనానికై తపించే మీరా చూసే వారికి ఓ దేవతలా, గోపికగా కనిపించింది. పాలు, పండ్లు మాత్రమే తీసుకుంటూ ఈ లోకంలో సంబంధం లేక శ్రీకృష్ణ దర్శనానికై తపించింది మీరాబాయి.

ఓక రాజు బృందావనంలో గొప్ప సాధువు జీవ గోస్వామి ఉన్నారని విని వారి దర్శనానికై మీరాబాయి ఆశ్రమానికి వెళ్లింది. గోస్వామి వారు నికుంజలో శ్రీకృష్ణునిపై మనస్సు నిలిపి, ధ్యానంలో ఉన్నారు. వారి శిష్యులు మీరాబాయిని నిలిపి తమ గురువుగారు స్త్రీలను చూడరని చెప్పి నిరాకరించారు. మీరా ఈ మాట విని నవ్వి "అలాగా! బృందావనంలో శ్రీకృష్ణుడు ఒక్కడే పురుషుడు, మిగతా వారందరూ గోపికలు అని నేను అనుకున్నాను" అని చెప్పి వెళ్లిపోయింది. పిమ్మట ఈ విషయం తన శిష్యుల ద్వారా వినిన గోస్వామి వారు మీరా లాంటి సాధ్వి తప్ప మరెవ్వరూ ఇంతటి ఉత్తమంగా మాట్లాడరని చెప్పి వారే స్వయంగా మీరా దర్శనాన్ని కోరారు.

మీరా ఎన్నో సంవత్సరాలు బృందావనంలో ఎంతో ఉత్సాహంగా సంతోషంగా శ్రీకృష్ణ ధ్యానంలో గడిపింది. బృందావనంలో పశు, పక్ష్యాదులు, చెట్లు, చేమలు, కొండలు, కోనలు ఆమె భక్తికి మెచ్చి ఆశీర్వదించాయి. బృందావనంలో ప్రతిచోట శ్రీకృష్ణుని చూచింది మీరా. మీరా స్ఫూర్తితో ఎందరో నామ సంకీర్తన చేస్తూ మీరాతో కలిసి ఇహలోక బంధాల నుంచి దూరంగా వున్నారు. మీరా ఇలా గానం చేసింది.

"జో పహిరావై సోయ్ పహిరూమ్

జో దేయి సోయ్ కావూం

జో బైఠావై తితహి బైఠూం"

(నాకు ఏది ఇస్తే అది ధరించి, ఇచ్చినది తిని, ఎక్కడ కూర్చోమని నా ప్రభువు చెబుతాడో అక్కడ కూర్చుంటాను.)

బృందావనంలో యమునా తీరంలోని ప్రముఖమైన "బాంకే బిహారిజీ"

(మురళీధర) మందిరమును దర్శించి పొంగిపోయింది మీరాబాయి. శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహం, త్రిభంగిమ, మన మోహన ముగ్ధరూపం మీరా మనస్సును చూరగొన్నది. తన మనస్సును శ్రీకృష్ణునిపై నిలిపి, తంబురా చేతిలో పట్టుకొని పాటలు పాడుతూ, అలాగే దాసిలా నిలబడి పోయింది. మీరా తను చిత్తోడ్ వదలి వచ్చేటపుడు తన ఆభరణాలను మూట కట్టి ప్రక్కన వుంచింది. ఆ ఆభరణాలను మీరా తన ప్రియ "బాంకే బిహారిజీ"కి సమర్పించింది.

మీరా కీర్తనలు బృందావనమంతా వ్యాపించి ఘుమఘుమలు పంచింది. బృందావనంలో ఎంతో కాలంగా నివసించే సాధువులు మీరాను ఎంతో అభిమానంగా, ఆప్యాయంగా చూశారు. మీరామాత పవిత్రత, శ్రీకృష్ణ భక్తి, సాహిత్య సంగీత ప్రావీణ్యత వారిని ఎంతగానో ఆకర్షించాయి. మీరా ఇవేమీ పట్టనట్లు చిన్నతనం నుండి తాను ఎంతగానో తపించిన బృందావనంలో యమునా తీరాన, నికుంజ వనమున, మందార చెట్ల మొదళ్లలో, గుట్టలు, సెలయేళ్ళ చుట్టు తన శ్రీకృష్ణునితో ప్రతి అడుగునా మూలమూల తిరుగుతూ, పాడుతూ సంతోషంగా ఆటలు ఆడింది.

మీరా బృందావనంలో శ్రీకృష్ణ ధ్యాన, స్మరణ, కీర్తనలతో తనను తాను మరచి పోయింది.

మనమూ మీరా మాతతో కలిసి నామసంకీర్తన చేద్దామా?

**హరే రామ హరే రామ రామ రామ హరే హరే**

**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే**

*(సశేషం)*

*తెలుగు అనువాదం: శ్రీమతి సీతా దేశికన్*


## భక్తి TV లో మన సత్సంఘ కార్యక్రమములు
## శ్రీమత్ భాగవత కథామృతం

ప్రవచన కర్త : శ్రీమతి లతా రవిచంద్రన్
ప్రసారము : గురువారం మరియు శుక్రవారము
సమయం : మ॥ గం॥ 3:00 లకు

# ఆత్మ దర్శనం

## బాహ్యభక్తి కాదు, అంతర్భక్తి ప్రధానం

**- శ్రీ స్వామీజీ**

'మంగైయర్కరసి' అనే మహాతల్లి మంచి శివభక్తురాలు. అందము, శీలము, మంచితనము నిండిన గుణవంతురాలు. ఈమె పాండ్యరాజు పట్టమహిషి. అన్నింటికీ మించి ఆశ్చర్యకరముగా తన భక్తిని రహస్యముగా తన హృదయములోనే దాచుకుంది.

కొందరిని మనము గమనించవచ్చును. 'మేము కృష్ణ భక్తులము, మేము శివభక్తులము; మేము దేవి భక్తులము' అని చెప్పుకుంటారు. దాని గురించి ఆ ఆ దైవాలనే అడగాలి! వీరిని వారు తమ భక్తులుగా అంగీకరించారా లేదా అన్న విషయాన్ని. మన భక్తిని లోకము అంగీకరించకపోయినా ఫరవాలేదు; భగవంతుడి మెప్పుని పొందితే చాలు. దానికి విరుద్ధంగా లోకుల మెప్పును పొందీ, లోకులు మనల్ని భక్తులని అంగీకరించి, దేవుడు నిరాకరిస్తే ఏమి లాభము?

'భక్తి' అనేది 'భగవంతునికొరకే' అనేది పోయి 'లోకప్రదర్శన కొరకు' అని అయినట్టున్నది. మనకు ఉన్నదేమో కాస్తంత భక్తే! అదీ బయటపడితే, పలువురు మెచ్చుకుంటారు. దానివల్ల మనకు గర్వము వస్తుంది. గర్వము వచ్చిందంటే ఉన్న కాస్త భక్తి కూడా మాయమవుతుంది. అందువల్లనే తన భక్తిని బహిరంగపరచకుండా దాచి ఉంచింది ఆ మహాతల్లి మంగయర్కరసి. కాని ఒక రోజు ఆమె నిద్రలో తనకు తెలియకుండానే 'శివ శివ' అని కలవరించడము వల్ల ఆమె శివభక్తి బహిర్గతమైనది.

'కల' అనేది అంతర్మనస్సు యొక్క బహిర్ముఖ మార్గమే! కలలో కనపడేవన్నీ మన మనస్సుని ఎక్కువగా బాధించిన విషయాలే అన్న మాటలో సందేహము లేదు.

లోక విషయాలను నిష్కామంగా చేయాలి. దైవీక విషయాలను శ్రద్ధతో, ప్రేమతో చేయాలి. కాని దీనిని మార్చి చేయటము వలననే చాలా మంది ఆధ్యాత్మిక వాదులకు కూడా లౌకిక విషయాలు కలల్లో కూడా భయపెడుతుంటాయి.

ఒక నాటక ప్రదర్శన. అంతా తయారవుతున్నారు. అందులో దేవీభక్తుడి వేషంలో నటిస్తున్న మనిషి ఇంకా రాలేదు. అతడు ఒక కార్యాలయములో ఉద్యోగి. సాయంత్రము పని ముగించుకుని వచ్చేసరికి ఆలస్యమయింది. నాటక నిర్వాహకులకు బెంగ ఎక్కువైంది. ఎలాగో అతడు వచ్చేశాడు. త్వరత్వరగా ముఖము కడుక్కొని

రంగు పూసుకొని, దుస్తులు మార్చుకున్నాడు. ఎర్రటి దుస్తులు, నుదుటమీద కుంకుమ తిలకం, మెడలో స్ఫటిక మాల, పొడుగైన జుట్టు, గడ్డము – అంతా సిద్ధమే!

చేతిలో పుష్పములు నిండిన బుట్టతో తెరతొలగగంగానే భక్తి పారవశ్యముతో వేదిక మీద వచ్చి కూర్చున్నాడు. అతడి ఎదురుగా 'కలకత్తా కాళి' ప్రతిమ ఉంచబడి ఉన్నది.

అతడు పలికిన వచనములు భావపూరితముగా ఉన్నాయి. 'జగన్మాతా! వేదమాతా! అమ్మా! ప్రపంచములో ప్రేమలేని బిడ్డలు ఉంటారేమోగాని, ప్రేమలేని తల్లులు ఉండరు కదమ్మా? నీ దర్శనము దొరకని ఒకొక్క క్షణము నాకు ఒక యుగముగా గడుస్తుందమ్మా! నీ వియోగము నా హృదయాన్ని ముక్కలు ముక్కలు చేస్తుందమ్మ! నాకు ధనము అవసరము లేదు; సంపదలు వద్దు; పేరు ప్రతిష్టలు ఏమీ వద్దు; నీవే కావాలమ్మ!" అని భాషణము బాగా చెప్పాడు. తలను నేలకు కొట్టుకున్నాడు. కిందపడి దొర్లాడు; విలవిలలాడి పోయాడు.

ఇవన్నీ ఉండనీ! ఇప్పుడు ఆ నటుడి మనస్సులో ఎటువంటి ఆలోచనలు ఉంటాయి? 'దేవి ఎందుకు ఇంకా నాకు దర్శనము ఇవ్వలేదు?' అని ఆలోచిస్తుంటాడా? కానే కాదు! మరి వేరేమి ఆలోచిస్తాడు? 'మనము ఇంత బాగా నటిస్తున్నాము; రశికులు ఇంకా చప్పట్లు కొట్టలేదేమి?' అని ఆలోచిస్తుంటాడు. ఇదే యథార్థము; సత్యము.

కాబట్టి మన భక్తి ఏ రోజైతే ఇతరుల కోసము కాకుండా "భగవంతుడి కోసము మాత్రమే" అని అవుతుందో ఆ రోజే దాని నిజమైన ఫలితము లభిస్తుంది.

***తెలుగు అనువాదం: శ్రీమతి రాజి రఘునాథన్***

ఉత్తమ భక్తి యోగాన్ని అవలంభించే వ్యక్తి సదా కీర్తించటములోను, పూజలోను, ధ్యానములోను, కథా ప్రవచనము చేయటంలోను, కథా శ్రవణము చేయటంలోను, కైంకర్యము చేయటంలోను నిమగ్నుడై వుంటాడు.

....శ్రీ స్వామీజీ

## పాఠకులకు గమనిక

"మధురమురళి" భక్తి మాస పత్రిక గురించి మరియు భక్తి టీవిలో ప్రసారం అవుతున్న శ్రీమత్ భాగవత కథామృతం కార్యక్రమం గురించి మీ అభిప్రాయములు మాకు పేజి నెం. 2 లో ఇచ్చిన చిరునామాకు తెలుపవలసినదని కోరకుంటున్నాము.

# సనాతన విడికథలు-29

1. గాయత్రి మంత్రములో అక్షరాలు ఎన్ని? పదాలు ఎన్ని? ఎనిమిది అక్షరాలతో కూడిన పంక్తులు ఎన్ని?
2. శతాక్షరి గాయత్రి అంటే ఏమిటి?
3. ఒకరికి తమ గోత్రము తెలియకపోతే ఏమి చేయాలి?
4. ప్రాణాయామములో పూరకము, కుంభకము, రేచకము – అంటే ఏమి? వాటి కాలపరిమితి ఏమి?
5. గాయత్రి మంత్రం (బ్రహ్మోపదేశము) గురించి ఆదిశంకరుడు ఏ గ్రంథములో చెప్పారు?
6. విష్ణు సహస్ర నామములో (మహాభారతములో ఉన్నట్టు) క్రింద నామాలు ఎన్నిసార్లు వస్తున్నాయి?

   శ్రీమాన్; కేశవ; పురుషోత్తమ; పద్మనాభ; కృష్ణ; మాధవ; మధుసూదన; జనార్ధన; శ్రీనివాస; గోవింద; వాచస్పతి; వాసుదేవ.
7. మృకండు మునికుమారుడు ఎవరు? 'తిరుక్కడైయూర్' క్షేత్రానికి వీరి కుమారునికీ ఏమి సంబంధము?
8. 'ఏకం సత్ విప్రా బహుదా వదంతి' అనే వాక్యము ఎక్కడ కనబడుతుంది?

*తెలుగు అనువాదం: శ్రీమతి రాజి రఘునాథన్*

మహాత్ములు మనలను చూడాలి, మనతో మాట్లాడాలి అని కూడ అవసరము లేదు. వారి సన్నిధిలో మనం వుంటేనే చాలు, వారి దర్శన మాత్రము చేత సర్వమంగళములు కలుగుతాయి.

....శ్రీ స్వామీజీ

**పాఠకులకు గమనిక: మీ మీ చందాలు ముగిసినట్లయితే మీరు తిరిగి చందా (Renewal) కట్టవలసినదిగా కోరుతున్నాము. మీ పేరు, అడ్రస్ మారితే కొత్త అడ్రస్, మీ చందా నెంబరు, మీ చందా క్రింద తెలుపబడిన విధముగా చేయగలరు.**

# సనాతన విడికథలు-28 : జవాబులు

1. గిరి కర్ణిక (గరుడ / పద్మ పురాణాలలో చెప్పబడినది)
2. అర్జునుని రథ ధ్వజముపై హనుమంతుడు

   కర్ణుని రథ ధ్వజముపై నీలి తామరపుష్పము

   దుర్యోధనుని రథ ధ్వజముపై మణితో కూడిన రాజనాగము
3. ఆయుష్; ఋగ్వేదములలో
4. గురు గుహ; శ్యామ కృష్ణ
5. కబీర్‌దాసు - బోజపురి భాషలో

   సూరదాసు - వ్రజ భాషలో

   తులసీదాసు - అవధి భాషలో, తమ సాహిత్యాలను రచించారు.
6. 'విదస్తా' అనబడే జీలం నది.
7. స్థాణు తీర్థం : సరస్వతి నదీ తీరములో ఉన్నది. వశిష్ట, విశ్వామిత్ర కుటీరాలు ఉండేవి. తారకుడు అనే అసురుణ్ణి రాముడు ఇక్కడే సంహరించాడు.
8. సంజయుడు పది రోజులు యుద్ధభూమిలో ఉన్నాడు. 10వ రోజు భీష్ముడు అంపశయనం ఎక్కాడు. దీని గురించి చెప్పటానికి సంజయుడు హస్తినాపురములో ఉన్న ధృతరాష్ట్రుడి వద్దకు వస్తాడు. (భీష్మ పర్వం 13వ అధ్యాయం) ఆ తర్వాత 25వ అధ్యాయము మొదలు 42వ అధ్యాయము వరకు గీత. అందువల్ల ఇది ఒక ఫ్లాష్‌బాక్‌లాగా వస్తుంది. 'యుద్ధభూమిలో ఏమి జరిగింది?' అని ధృతరాష్ట్రుడు అడుగగా సంజయుడు వివరిస్తాడు.

ఆదిశంకర సంప్రదాయములో పుట్టినవారు అద్వైత సిద్ధాంతము మాత్రమే సరియైనదని, రామానుజ సాంప్రదాయములో పుట్టిన వారు విశిష్టాద్వైత సిద్ధాంతము మాత్రమే సరియైనదని, మధ్వ సంప్రదాయములో పుట్టినవారు ద్వైతమే సరియైనదని అంటారు. యిందులో ఏది సరియైనదో నాకు తెలియదు గాని వీరు ముగ్గురు నామ సంకీర్తనము మాత్రము సరియైనదని ఒప్పుకోవటం నాకు సరియైనదని అనిపిస్తున్నది.

....శ్రీ స్వామీజీ

# పిబరే ప్రేమరసం

## భగవత్సౌందర్యము

స్వచ్ఛమైన బంగారము ఎటువంటి ఆభరణములను తయారు చేయటానికి పనికిరాదు. అది స్వర్ణము, అంతే. కొంచమైనా రాగి కలపనిదే, స్వచ్ఛమైన బంగారముతో ఏమీ చేయలేము. అదే విధముగా బ్రహ్మము కూడా. స్వచ్ఛమైన బంగారము యొక్క స్థితిలో ఉన్నట్లే నిర్గుణమైనది, నిష్కల్మషమైనది, నిష్కామమైనది. ఆ స్థితిలో తానుగా ఏమీ చేయలేనిది. తమలో తాము రమిస్తున్నటువంటి మహాత్ములు, సామాన్యమైన వారితో కలవలేరు. ఒక మానవుడికి ఎన్ని అవసరమో అన్ని గుణములను చేర్చుకొని శరీరమును ధరించి ఒక అవతారముగా, భగవద్భక్తులుగా, మహాత్ములుగా ఈ భూలోకానికి అనుగుణముగా తమను తాము మార్చుకొని మనకు ఓదార్పు నొసగుటకు దిగి వచ్చినారని ఆధ్యాత్మిక గురువులు తెలిపెదరు.

హంస జాతి పక్షులను గురించి వినియున్నాము కదా! ఆ హంస, పాలలోని నీటిని వేరుచేసి పాలను త్రాగి, నీళ్ళను వదలివేయునట. అలాగే బంగారు తుమ్మెద అని ఒక జాతి తుమ్మెద కలదు. అది అన్ని పూల మీద వ్రాలదు. అది ఉత్తమమైన మధువు లభించే పూలపైన మాత్రమే వ్రాలును. అదే విధముగా భగవద్భక్తులు ఏ కార్యము చేసినప్పటికి సామాన్యులైన వారి చర్యల వలె అగుపించినప్పటికీ, వారు ఎల్లప్పుడూ సర్వం బ్రహ్మమయం అనే దృష్టితోనే ఉంటారు తప్ప ఆ స్థాయి నుండి క్రిందికి దిగిరారు.

శ్రీశ్రీ స్వామీజీ అప్పుడప్పుడు ఇలా అంటుంటారు. "మానవ నిర్మితములైన ఏడు అద్భుతములను గురించి గొప్పగా చెప్పుకొంటారు కానీ అవి ఏవీ నిజముగా అద్భుతములు కానే కావు. నిజమైన అద్భుతము ఏమిటనగా మహాత్ములు వారున్న ఉన్నత స్థితి నుండి మనకొరకు దిగివచ్చి ఈ జగత్తులో సంచరించుటయే."

మహాత్ముల యొక్క నిజమైన ఆనంద స్థితిని గానీ, లేక వారి మనస్సు సంచరించే స్థితినిగానీ సామాన్యులైన మనము అర్థము చేసుకొనలేము. అజ్ఞానము చేత మనము పొందే దుఃఖమును చూచి భరించలేక మహాత్ములు వారి స్థితి నుండి క్రిందికి దిగి వచ్చి మనలను ఉద్ధరించటానికి అవతరిస్తున్నారు.

కొంతకాలము క్రితము శ్రీశ్రీ స్వామీజీ బెంగళూరులో నిర్మాణములో ఉన్న

"శ్రీ సుందర హనుమాన్" దేవాలయమునకు విచ్చేసిరి. ఆయన దేవాలయములో ఉన్నప్పుడు ఒక ప్రముఖుడు శ్రీశ్రీ స్వామీజీకి ఒక శ్రీ శ్రీనివాసుని విగ్రహమును యిచ్చిరి. ఆ విగ్రహము యొక్క సౌందర్యము దేనితో పోల్చలేనంత అందముగా ఉండెను. శ్రీశ్రీ స్వామీజీ ఆ విగ్రహ సౌందర్యములో నిమగ్నులై ఎక్కువసేపు దాని వంక చూచుచుండిరి. ఆ విగ్రహము వైపు ఆ విధముగా తనను మరిచి, దాని సౌందర్యమును తన్మయత్వముతో మెచ్చుకోలుగా చూచుచున్న సమయము నందు, ఆయన దర్శనము కొరకు ఒక దంపతులు వచ్చిరి.

ఆ దంపతులు శ్రీశ్రీ స్వామీజీతో కొంతసమయము గడిపిన తర్వాత, ఆయన చేతిలోని ఆ దివ్యమంగళ స్వరూపమైన శ్రీనివాసుని విగ్రహము వైపు తదేకముగా చూస్తున్న శ్రీశ్రీ స్వామీజీని చూసి, వారు "స్వామీజీ! ఈ విగ్రహము శ్రీ స్వామీజీ యొక్క పూజా మూర్తియేనా" అని అడిగారు. శ్రీశ్రీ స్వామీజీ వారివైపు తిరిగి అడ్డముగా తల ఊపిరి. తర్వాత "ఒక మనిషి తయారు చేసిన ఈ విగ్రహము, అందులో శ్రీనివాసుడు యింత అందముగా ఉంటే, నిజస్వరూపము నందు యింకా ఏ విధముగా ఉంటాడు? అని ఊహించుకొంటున్నాను" అని పలుకగా, శ్రీశ్రీ స్వామీజీ మాటలకు ఆ దంపతుల కళ్లు ఆర్ద్రములైనవి.

ఎల్లప్పుడు లౌకిక విషయములను గురించి చింతిస్తూ, అందులోనే ఆనందమును వెతుకుకొనే మనము ఆధ్యాత్మిక ప్రవచనములను వినటము, సత్సంగములయందు పాల్గొనుట, చేసినప్పటికీ, అక్కడి నుండి తిరిగి వచ్చిన వెంటనే మరల అదే లౌకిక ప్రపంచము నందే తిరుగుచూ ఉండెదము. ఈ విధముగా కొద్ది సమయము మాత్రము ఆధ్యాత్మిక చింతన, మిగిలిన సమయము నంతా బాహ్యప్రపంచము నందు ఈగల వలె తిరుగాడు చుండెదము. కానీ స్వర్ణ తుమ్మెదల వంటివారైన మహాత్ములు లౌకిక ప్రపంచము నందు మన మధ్య తిరుగుచున్నప్పటికీ, వారు ఎంతకాలము జీవించి ఉన్నప్పటికీ, వారిలోని దైవత్వము కానీ, వారికి భగవంతునిపై గల ప్రేమగానీ యిసుమంత కూడ మారదు.

*తెలుగు అనువాదం: శ్రీమతి హెచ్.కమల శర్మ*

> వేదము, శాస్త్రము, ఇతిహాసము, పురాణము, భజనము, సత్సంగము, గురువు యొక్క సాంగత్యము, వీటన్నిటి వలన మన మనస్సు అంతర్ముఖం కాలేదు అంటే వీటి వలన ప్రయోజనము ఏమి లేదు.
>
> ....శ్రీ స్వామీజీ

# రామాయణ విశేషములు
## శరణాగతి

వాలిని గురించిన చర్చలో ధర్మసూక్ష్మం గురించి ప్రస్తావన జరిగింది. ధర్మం అతి సూక్ష్మమయినది. మానవ ఆచరణను మనుధర్మశాస్త్రం నిర్వచిస్తున్నది. వేదాలు, శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలు ప్రమాణంగా ఉన్నాయి. ఈ ధర్మనియమాలు నిత్యమయినవి. కాలవ్యవధిలో వీటికి మార్పు రావటానికి అవకాశం లేదు. అయితే పరధర్మం మహోన్నతమయినది. నిస్స్వార్థంగా ఆచరించే ధర్మం పరధర్మంగా వర్తిస్తుంది. భగవంతునికి అర్పణ చేసుకున్నవాడు లోకధర్మానికి అతీతుడుగా ఉంటాడు. అతని ధర్మం ఒక్కటే, అది భగవంతుడు.

ఒక్కొక్క యుగానికి ఒక్కొక్క ధర్మం నియమింపబడింది. ధర్మం యొక్క నాలుగు పాదాలు ఏమిటంటే, తపస్సు, శుచి, దయ, సత్యం. కృతయుగంలో అది ఈ నాలుగు పాదాలమీద నడిచింది. త్రేతాయుగంలో శుచి, దయ, సత్యం అనే మూడు పాదాలమీద నడిచింది. ద్వాపరయుగంలో దయ, సత్యం అనే రెండు పాదాల మీద నడిచింది. కలియుగంలో సత్యం అనే ఒంటిపాదం మీద నడుస్తున్నది.

అయితే భక్తుడు ధర్మాన్ని గురించి ఆందోళన చెందడు. లీలాశుకుడు అంటారు:

**సన్ధ్యావన్దన భద్ర మస్తు భవతో భోః స్నాన తుభ్యంనమో**
**భోదేవాః పితరశ్చ తర్పణవిధౌ నాహం క్షమః క్షమ్యతం।**
**యత్రక్వాపి నిషద్య యాదవకులోత్తమస్య కంసద్విషః**
**స్మారం స్మారమఘం హరామి తదలం మన్యే కిమన్యేన మే॥**

తాత్పర్యం: ఓ సంధ్యావందనమా! నీకు శుభం. ఓ స్నానమా! నీకు ఒక నమస్కారం. దేవతలారా! పితృలారా! తర్పణాది విధులను ఆచరించటానికి నేను అశక్తుడను, నన్ను క్షమించండి. ఎక్కడయినా కూర్చొని యదువంశ శేఖరుడయిన కంసవిరోధిని స్మరించి పాపాన్ని పోగొట్టుకుంటాను. ఇతరంతో నాకు ప్రయోజనం ఏమిటి?

(వ్యాఖ్య: ఇది ధర్మనిర్వహణ తృణీకరణ కాదు, దేవదేవుని యందు భక్తి ఆచరణ యొక్క ముఖ్యత్వం.)

కులశేఖర ఆళ్వార్లు ముకుందమాలలో అంటాడు:

శ్లోకం-5:

**నాస్థాధర్మే నవసునిచయే నైవకామోపభోగే ।**
**యద్భవ్యం తద్ భవతు భగవన్ పూర్వకర్మానురూపం ॥**
**ఏతత్ ప్రార్థ్యం మమబహుమతం జన్మ జన్మాంతరేపి ।**
**త్వత్పదామ్భోరుహ యుగగతా నిశ్చలాభక్తి రస్తు ॥**

తాత్పర్యం: ఓ స్వామీ! నేను ధర్మాన్ని కాంక్షించటం లేదు, ధనరాశిని కాంక్షించటం లేదు, కామములను అనుభవించాలని ఆశించటం లేదు, పూర్వకర్మానుసారంగా ఏదేది సమంజసమో, కలుగు గాక! జన్మజన్మలలో కూడ నీ పాదారవింద ద్వయం మీద భక్తి నాకు స్థిరంగా ఉండాలి. ఇదే నాకు మిక్కిలి ప్రియమైనది.

(వ్యాఖ్య: ఈ శ్లోకంలో ఎంతో సత్యం ఇమిడి ఉంది. ప్రథమమైనది, భగవంతుని యందు భక్తి కలిగి ఉండటం, అదే నిజమైన ధర్మం. రెండవది, ఆళ్వార్లు పునర్జన్మను వాంఛిస్తున్నారు, మోక్షాన్ని వాంఛించటం లేదు. భగవంతుడే మరల మరల అవనిలో అవతరిస్తూ ఉంటే, అతని క్రీడలో పాల్గొనకుండా భక్తుడు ఎలా స్తబ్ధంగా ఉండగలడు?)

శ్లోకం-21:

**ఆమ్నాయాభ్యసనా న్యరణ్యరుదితం వేదవ్రతాన్యన్వహమ్ ।**
**మేదశ్ఛేదఫలాని పూర్తవిధయ స్సర్వే హుతం భస్మని ॥**
**తీర్థానామవగాహనానిచ గజస్నానం వినా యత్పద ।**
**ద్వన్ద్వామ్భోరుహ సంస్మృతిం విజయతే దేవ స్సనారాయణః ॥**

తాత్పర్యం: ఎవని పాదసరోజాలయందు భక్తి లేనివారు చేసే వేదాధ్యయనం అరణ్యరోదనంగా ఉంటుందో, నిత్యవేదూక్త వ్రతాలు దేహక్షీణఫలితంగా ఉంటాయో, సర్వవిధులు (ధర్మకార్యాలు) బూడిదలో పోసిన ఆహుతులులా ఉంటాయో, పుణ్యనదీ స్నానం ఏనుగుస్నానం లా ఉంటుందో, అలాంటి భగవంతుడైన నారాయణుడు సర్వోత్కృష్టుడు.

(వ్యాఖ్య: ఈ శ్లోకం మూలంగా ఆళ్వార్లు చేస్తున్న బోధన ఏమిటంటే, భగవంతుని చరణాల యందు భక్తి కలిగి ఉండాలని, అది లేకుండా ఎన్ని ధర్మకార్యాలు

నిర్వహించినప్పటికీ అవి వ్యర్థంగా ఉంటాయని.)

రామాయణంలోని ముఖ్యాంశం శరణాగతి. ఇది విభీషణుని మూలంగా తెలియజేయ బడింది. తన జ్యేష్ఠ సహోదరుడు, రాజు అయిన రావణునికి విభీషణుడు హిత బోధ చేశాడు. రావణుడు పెడచెవిని బెట్టి అతణ్ణి రాజ్యం నుండి బహిష్కరించాడు. రావణుడు భగవంతుణ్ణే ధిక్కరించాడు, కాబట్టి అతణ్ణి త్యజించి విభీషణుడు రాముణ్ణి ఆశ్రయించటానికి నలుగురు సచివులతో కలిసి వచ్చాడు. ఆకాశంలో నిలబడి అతడు సుగ్రీవునికి తనను పరిచయం చేసుకొని విన్నవించాడు, తాము రాముని ఆశ్రయం అర్థించటానికి వచ్చామని. సుగ్రీవుడు రామునికి తెలియజేశాడు. రాముడు తన హితులతో సంప్రదించాడు, ఎందుకంటె అది రాజధర్మం కనుక. హనుమంతుడు తప్ప, ఇతరులందరూ సలహా చెప్పారు, శత్రుపక్షం నుండి వచ్చిన వాని విషయంలో చాల అప్రమత్తతో ఉండాలని, వాణ్ణి అంగీకరించ కూడదని. చివరిగా రాముడు బోయవాడు–పావురము అనే నీతికథను చెప్పి, అన్నాడు, "ఏ జీవి అయినా 'నీ వాడిని,' అని నన్నాశ్రయిస్తే, నేను అభయం ఇస్తాను. రావణుడే వచ్చి శరణు వేడితే, అతనికి అభయం ఇస్తాను." ఇదీ రామునిలోని విశిష్టత, తన సతిని అపహరించిన రావణుడే వచ్చి శరణు వేడితే అభయం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. అతడు శరణాగతవత్సలుడు.

రామాయణ కథాప్రారంభానికి నాంది వాల్మీకి మహర్షి నారద మహర్షికి వేసిన ప్రశ్న:

శ్లో–2: **కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్కశ్చ వీర్యవాన్ ।**
**ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః ॥**

తాత్పర్యం: ఈ భూమండలంలో ఇప్పుడు ఉత్తమగుణాలు కలవాడు, అత్యంత శక్తిసమన్వితుడు, ధర్మమెరిగినవాడు, ఉపకారం తలిచేవాడు, సత్యం పలికేవాడు, స్థిరసంకల్పం కలవాడు ఎవ్వడు?

రాముడు కల్యాణగుణాభిరాముడే కావచ్చు, మహా పరాక్రమవంతుడే కావచ్చు, ధర్మనిరతుడే కావచ్చు, కృతజ్ఞుడే కావచ్చు, సత్యవాక్పరిపాలకుడే కావచ్చు, (ఇంకా అతడు పితృవాక్య పరిపాలకుడే కావచ్చు, ఏక పత్నీవ్రతుడే కావచ్చు, రాక్షస సంహారకుడే కావచ్చు, ఇంకా ఏమేమో కావచ్చు), కానీ భక్తునికి అతడు శరణాగతవత్సలుడుగా ప్రియమైన వాడు, పాపపుణ్య విచక్షణ చేయని కృపాసాగరుడైన

భక్తవత్సలుడు.

"స్తోత్రరత్నం"లో ఆళవందార్ అంటారు, శ్లో-23:

**న నిందితం కర్మ తదస్తి లోకే సహస్రశో యన్న మయా వ్యధాయి ।**
**సోహం విపాకావసరే ముకుంద క్రందామి సమ్ప్రత్య గదిస్తవాగ్రే ॥**

తాత్పర్యం: ముకుందా! నేను వేనకువేలుగా చేయని దుష్కర్మ అంటూ లేదు. ఆ కర్మలు ప్రతిఫలించే ఈ సమయంలో అన్యగతి లేని వల్ల నీ ముందు ఆక్రందిస్తున్నాను.

శ్లో॥ 24: **నిమజ్జతో అనంత భవార్ణవాంత శ్చిరాయ మేకూల మివాసి లబ్ధః।**
**త్వయాపి లబ్ధం భగవన్నిదానీ అనుత్తమం పాత్రమిదం దయాయాః॥**

తాత్పర్యం: భవసాగరంలో మునిగి ఉన్న నాకు, ఓ అనంతా, తీరం లాగ నీవు లభించావు. నీ దయను చూపించడానికి ఉత్తమమైన పాత్రగా ఓ ప్రభూ! నీకు నేను లభించాను. ఇందులోని భావార్థం ఏమిటంటే, భగవంతుని కరుణను అనుభవించటానికి పాపపుణ్యాలతో ప్రమేయం లేదని.

భద్రాచల రామదాసు పడిన బాధలను స్మరించి, అతని విషయంలో రాముడు చాల కఠినంగా ప్రవర్తించాడని కొందరు అనవచ్చు, అది రామదాసు యొక్క పూర్వజన్మ కర్మఫలితమని మరికొందరనవచ్చు. ఇది సత్యమని అనటానకి అవకాశం లేదు; ఎందుకంటె అవనిలో భక్తిని వ్యాప్తి చేయటానికి భగవంతుడు మహాత్ములను తరచు పంపిస్తూ ఉంటాడు. వారు కర్మబద్ధులు కారు. అలాంటి మహాత్ములలో భద్రాచల రామదాసు ఒకడు. ఆ భక్తుని భక్తి విశేషం వల్లనే ఇప్పుడు లక్షలాది జనులు శ్రీరాముణ్ణి ఆశ్రయిస్తున్నారు, కలిదోషం ఆవరించి ఉన్న ధరణిలో శాంతిని అనుభవిస్తున్నారు.

**రామాయణంలోని విశిష్టత శరణాగతి.**

**భగవంతుని శరణాగత గుణానికి జేజేలు! అతని సౌలభ్యానికి జేజేలు!**

**హరే రామ హరే రామ రామ రామ హరే హరే**

**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణకృష్ణ హరే హరే**

*- డా॥ హరగోపాల్ సేపూరి*




సిడ్నీ (ఆస్ట్రేలియ) నందు నగర సంకీర్తనంలో భక్తులు



జకార్త (ఇండోనేషియ) నందు విద్యార్థులతో సత్సంఘం

Sri Hari

# Madhuramurali

*Devotional Monthly*

Volume - 3 December - 2011 Issue - 09

RNI : Reg. No. APTEL /2009/28455
Postal Reg. No. L II/RNP/HD/1115/2009-11
Date of Publication : 16th & 17th of every month



తులసీ కళ్యాణము

Printed & Published by **Mrs. Srilatha Ravichandran** on behalf of **Sri Sandeepani Gurukula Seva Trust (A.P.),**
2nd Floor, Shyam Apartments, 6-3-563/F, Erramanzil, Hyderabad - 500 082. Tel : 040-2339 2758
Published at : 2nd Floor, Shyam Apartments, 6-3-563/F, Erramanzil, Hyderabad - 500 082.
Editor - **Mrs. Srilatha Ravichandran**
Printed at **M/s. Surya Graphics,** 1-1-283/C/1, Municipal Market Lane,
Chikkadpally, Hyderabad - 500 020. Tel : 040-6675 2838

**Related websites : www.madhuramurali.org / www.namadwaar.org**